క్లుప్తంగా

పౌష్టికాహారం పక్కాగా అందజేయాలి



కడవకల్లులో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సీడీపీఓ భారతి

పుట్లూరు: మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం నార్పల క్లస్టర్ సీడీపీఓ భారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. గర్భవతులు, బాలింతల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారానికి పక్కాగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పౌష్టికాహారం సరఫరా రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఆసుపత్రిలో గురువారం గుత్తి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ దేవదాస్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విజయలక్ష్మి, అమర్‌నాథ్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. క్షయ లక్షణాలు? వ్యాధి గుర్తింపు, తీసుకోవాల్సిన వైద్యంపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



పథకాల అమలుపై ఆరా తీస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శులు అంకితభావంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని 1, 34వ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకు ముందు ఆయన పాతగుంతకల్లులోని మున్సిపల్ గ్రంథాలయాన్ని సందర్శించారు.

తక్కళ్లపల్లిలో పశువైద్య శిబిరం

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో గురువారం ఏడీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. అలాగే పశువులకు వైద్య పరీక్షలు చేసి, కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగసువర్ణ, పశువైద్య సిబ్బంది రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గది ఏర్పాటు అభినందనీయం



తరగతి గదిని ప్రారంభించిన హుజూర్ సోలార్ కంపెనీ ప్రతినిధులు

యాడికి: గ్రామాభివృద్ధిలో భాగంగా హుజూర్ సోలార్ కంపెనీ యాజమాన్యం వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు దాదాపు రూ.30 లక్షలతో అదనపు తరగతి గది, ఐరన్ గ్రిల్, ఫర్నిచర్, గ్రీన్ బోర్డ్స్, టాయిలెట్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి కాశెప్ప కొనియాడారు. గురువారం మండలంలోని వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదిని ప్రారంభించారు. పాఠశాలలోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుజూర్ సోలార్ కంపెనీ ప్రతినిధులు మిశ్రా, గోపి, భరత్ కుమార్ రెడ్డి, అమృత్, సర్పంచ్ ఓంకారమ్మ, హెచ్‌ఎం గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

గుత్తి రూరల్: గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు, ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరించాలని తహసీల్దార్ ఓబిలేసు ఆదేశించారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో గురువారం డీటీ, ఆర్‌ఐ, వీఆర్‌ఓలతో రెవెన్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. రైతులు, ప్రజల నుంచి అత్యధికంగా ఏ సమస్యలపై వినతులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. డీటీలు శ్రీలత, లలితమ్మ, వీఆర్‌ఓలు సురేంద్ర, వెంకట్రాముడు, శివారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

అశ్వత్థం.. శివకేశవుల నిలయం





కట్టపై వెలసిన శింగరబట్టు, గణపతి, అశ్వత్థ నారాయణుడు

- ఈనెల 29 నుంచి తిరునాల ప్రారంభం
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న పాలకమండలి సభ్యులు

పెద్దపప్పూరు: శివకేశవులు ఒకే చోట కొలువైన క్షేత్రంగా.. పురాతన దేవాలయాల్లో ఒకటిగా, దక్షిణ కాశీగా అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రం పేరుగాంచింది. అశ్వత్థంలో ఈనెల 29 నుంచి తిరునాల ప్రారంభం కానుంది. 4 ఆదివారాల పాటు జరిగే ఈ తిరునాలకు ఏపీ నుంచే గాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. దక్షిణ, ఉత్తర ముఖంగా ప్రవహించే పెన్నానది ఒడ్డున వెలసిన స్వామిని మాఘమాసంలో దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. తిరునాల సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు ఇబ్బందులు పడకుండా పాలకమండలి సభ్యులు, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం చర్యలు తీసుకుంటున్నారు. చలువపందిళ్లు, భక్తుల కోస ప్రత్యేకంగా క్యూలైన్లు, స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ ఆదేశాలతో వృద్ధులు, వికలాంగులు చిన్నారులు పుణ్యస్నానాల కోసం నదీ లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకుండా ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ ముందస్తు చర్యలు చేపట్టారు. శని, ఆదివారాల్లో మినహా స్వామి దర్శనానికి ఎలాంటి రద్దీ ఉండదన్నారు. ఈనెల 29 నుంచి మాఘమాసం ప్రారంభం కానుండగా.. ఫిబ్రవరి 2, 9, 16, 23 తేదీల్లో నాలుగు ఆదివారాలు తిరునాల జరగనుంది. 26న మహాశివరాత్రితో ఉత్సవాలు ముగుస్తాయి. క్షేత్రానికి వచ్చే భక్తుల



భీముడితో ప్రతిష్ఠించబడిన చక్రభీమలింగేశ్వరుడు

సౌకర్యార్థం

తాడిపత్రి, ముచ్చుకోట, కొండాపురం, నార్పల, ధర్మవరం, బనగానపల్లి, గుత్తి, యాడికి, అనంతపురం, రాయలచెరువు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది.

ఇదీ ఆలయ చరిత్ర..

పూర్వం కీకారణ్యంగా పిలువబడే ఈ ప్రాంతంలో జనమేజయుడి పరిపాలనలో శింగరబట్టు అనే మహాముని తపస్సు చేసి నారాయణస్వామి, గణపతిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. మరికొంత కాలానికి పాండవులు అరణ్యవాసంలో భాగంగా ఇక్కడికి విచ్చేసిన తరుణంలో ఓ చెట్టునీడన నిద్రిస్తున్న భీముడికి కలలో ఈశ్వరుడు కనిపించి నారాయణుడికి ఎదురుగా తనను ప్రతిష్ఠించమని కోరాడు. ఈశ్వరుడి కోరిక మేరకు ఇక్కడ శివలింగాన్ని భీమసేనుడు ప్రతిష్ఠించడంతో అప్పటి నుంచి నేటి వరకు చక్రభీమలింగేశ్వరుడిగా స్వామి పూజలందుకుంటున్నారు. సంతానం లేని దంపతులు నారాయణస్వామి కట్టపై ఉన్న రావి చెట్టుకు ఊయల కడితే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడికి విచ్చేసే భక్తుల్లో ఎక్కువ శాతం నా అనే అక్షరంతో మొదలయ్యే పేర్లు ఎక్కువగా ఉండటం ఇక్కడి ప్రత్యేకత.

తిరునాలే మాకు ముఖ్యం



నా చిన్నప్పటి నుంచి మాకు అశ్వత్థం తిరునాలే పెద్ద పండుగలా భావిస్తాం నాలుగు ఆదివారాల పాటు జరిగే ఈ తిరునాలకు ఆడపడుచులను ఆహ్వానిస్తాం. చీరె, సారెలను పెట్టి పంపడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఎద్దుల బండ్లపై వచ్చేవారు. కాలానుగుణంగా మార్పు చెందడంతో వాహనాల్లో వస్తున్నారు. మాఘమాసం తిరునాలలో స్వామికి పొంగళ్లు పెట్టడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

– బి.కేశవ రెడ్డి భక్తుడు గార్లదిన్నె

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం



తిరునాలకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఈ ఏడాది భక్తుల స్నానాల కోసం వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు నదీ లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మాఘమాసం మూడవ ఆదివారం వేలాదిమంది భక్తులు ఇక్కడికి తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. అశ్వత్థం క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు.

– సుబ్రహ్మణ్యం, ఆలయ ఈఓ

శివకేశవులు ఒకే ప్రదేశంలో ఉండటం ఇక్కడి ప్రత్యేకత



శివకేశవులను ఒకే చోట దర్శించుకోవడం చాలా అరుదు. ఈక్షేత్రంలో వెలసిన నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరులను ఒకేచోట దర్శించుకోవచ్చు. ఏటా మాఘమాసంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అశ్వత్థం క్షేత్రంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు.

– సుధీర్ కుమార్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

‘లేత జొన్నగడ్డి మేస్తే గొర్రెలు చనిపోతాయి’



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

పెద్దవడుగూరు: లేత జొన్నగడ్డి మేస్తే వైద్యం చేసే లోపు గొర్రెలు చనిపోతాయని పశు సంవర్ధకశాఖ డివిజనల్ ఉప సంచాలకులు వై.రమేష్‌రెడ్డి, గుత్తి ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌చార్జ్ సహాయకులు డాక్టర్ పద్మనాభం, పెద్దవడుగూరు పశు వైద్యాధికారి కమలమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొండూరు గ్రామ సమీపంలో రైతు దేవమోహన్‌రెడ్డికి చెందిన పొలంలో లేత జొన్నగడ్డి తిని 40 గొర్రెలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. గురువారం కొండూరు గ్రామంలో పశు వైద్యాధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా గొర్రెలు మృతి చెందిన ప్రాంతాన్ని సందర్శించారు. గొర్రెల కాపర్లు రామకృష్ణ, సన్నప్ప సుంకన్న, గోపాల్, నరసింహుడు, నారప్ప, నాగభూషణంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లేత జొన్నగడ్డిలో హైడ్రోజన్ సైనైడ్ అనే విషపదార్థం ఉంటుందని అధికారులు తెలిపారు. గొర్రెలు, మేకలు వాటిని తినడం వలన త్వరగా చనిపోతాయని పేర్కొన్నారు. గొర్రెల కాపర్లు లేత జొన్నగడ్డి వైపు వెళ్లవద్దని సూచించారు. అయితే పోస్టుమార్టం చేయడానికి ఒక్క గొర్రె కూడా అందుబాటు లేకపోవడంతో బాధితులు చెప్పిన విధంగా వివరాలు సేకరించారు. చనిపోయిన వాటి ఖరీదు రూ.నాలుగు లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



నైరుతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ అనుబంధ విభాగాల నాయకులు

గుంతకల్లుటౌన్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా పార్టీశ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొనకొండ్ల అంజి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మోతే మస్తాన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నారప్ప తదితరులు నైరుతిరెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. తమపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరిస్తామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు సుభాష్ చంద్రబోస్



గుంతకల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నివాళి

గుంతకల్లు టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశ ప్రజల స్ఫూర్తి కెరటమని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణ, అధ్యాపకులు డాక్టర్ జనార్దన్ శాస్త్రి, రవిశంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో..

గుంతకల్లు: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రామారావు, ఈ.చలపతి, విశ్వనాథ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎస్.శివప్రసాద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో నడవాలి

గుత్తి: నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అడుగుజాడల్లో నడవాలని జేవీవీ జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ లు పిలుపునిచ్చారు. గుత్తిలోని నేతాజీ విగ్రహం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అమర్ రహే సుభాష్ చంద్రబోస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కొరకు సుభాష్ చంద్రబోస్ ఎంతో శ్రమించారన్నారు. దేశాభివృద్ధే ధ్యేయంగా, స్వాతంత్య్రమే లక్ష్యంగా పని చేశారన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీధర్ గౌడ్, రామాంజనేయులు, కోట గైడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గుత్తి బీసీసీ రోడ్డులోని నేతాజీ విగ్రహం వరకూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అక్కడ స్వాతంత్రోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ హిందూ ఫౌజ్ ఏర్పాటుతో చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం నేతాజీ విగ్రహానికి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంకుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు, మాజీ సైనిక ఉద్యోగులు లక్ష్మీనారాయణ, సురేంద్ర, ఎన్‌సీసీ క్యాడేట్స్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే ఊరుకోం

- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్



యాడికి: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే ఊరుకోబోమని ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్ హెచ్చరించారు. దివ్యాంగులకు అన్యాయం చేసేందుకు ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలనను కూటమి సర్కార్ చేపట్టిందని మండిపడ్డారు. గురువారం రాయలచెరువులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులు స్వశక్తితో ఎదిగేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ అన్ని విధాలుగా అండగా నిలిచారని గుర్తు చేశారు. 8.20 లక్షల దివ్యాంగులకు సదరం క్యాంపుల ద్వారా సర్టిఫికెట్లు మంజూరు చేయించి సామాజిక భద్రత పింఛన్ అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలనే కుట్రకు సీఎం చంద్రబాబు తెరలేపడం సిగ్గుచేటన్నారు. అశక్తులైన వారికి అండగా నిలవాల్సింది పోయి.. వారి పింఛన్లను తొలగించేలా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి మంచానికే పరిమితమైన లబ్ధిదారుల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టడం ముమ్మాటికీ ప్రభుత్వ కుట్రలో ఓ భాగమేనన్నారు. ప్రభుత్వ చర్యలతో దివ్యాంగులు మానసికంగా కుదేలవుతున్నారన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క దివ్యాంగుడి పింఛన్‌ను తొలగించినా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రభుత్వాస్పత్రి ఏఓను సస్పెండ్ చేయాలి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అవినీతి అక్రమాలు, మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఏఓ రామ్‌ప్రసాద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. గురువారం విజయవాడ సచివాలయంలో మంత్రి సత్యకుమార్‌ను న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, నాయకులు రామాంజనేయులు, సత్తార్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రి ఏఓ రామ్‌ప్రసాద్ అక్రమాలు, మహిళా ఉద్యోగినులతో వికృతచేష్టలపై ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు గుర్తు చేశారు. సీనియర్ మెడికల్ అధికారి నేతృత్వంలో గత నెలలో విచారణ చేపట్టారని.. అయినా ఇప్పటివరకు అతడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అతడిని సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసును నమోదు చేయించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

బ్లాక్ స్పాట్ల గుర్తింపు

గార్లదిన్నె: 44వ జాతీయ రహదారిపై పోలీసులు ,ఆర్టీఏ అధికారులు గురువారం సంయుక్తంగా బ్లాక్ స్పాట్లు గుర్తించారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి జాతీయ రహదారిపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే సైన్ బోర్డులు, కాషన్ బోర్డులు, రోడ్ బేరియర్స్, స్పీడ్ బ్రేకర్లు, వంటివి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం



గుంతకల్లు: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజాబాబు



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఉప రవాణా కమిషనర్ వీర్రాజు

తాడిపత్రి రూరల్: మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా డ్రైవర్లు, క్లీనర్లకు ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ప్రారంభించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో అందే పరిహారంపై వివరించారు. కార్యక్రమంలో తాడిపత్రి ఎంవీఐలు రాజగోపాల్, శ్రీనివాసులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు, అకాష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

మండలంలోని టెక్ కళాశాలలో గురువారం రోడ్డు ప్రమాదాలపై ఎన్‌హెచ్ డీఈ, ఎంవీఐలు అవగాహన కల్పించారు. రోడ్లపై బ్లాక్ స్పాట్‌లపై వివరించారు. వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి

గుంతకల్లు: రోడ్డు భద్రత ప్రమాణాలు తప్పక పాటించాలని గుంతకల్లు ఎంవీఐ నీలం వెంకట రాజాబాబు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు నిబంధనలు ప్రకారం నడుచుకోవాలన్నారు, ముఖ్యంగా కెపాసిటీకి ప్యాసింజర్లను ఎక్కించుకుని ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా మద్యం సేవించి డ్రైవ్ చేయడం, సెల్‌ఫోన్లు మాట్లాడుకుంటూ నడపడం మంచిది కాదన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఆటోలకు ఎఫ్‌సీ చేయించుకోవాలని సూచించారు. మీ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉంటే ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం అందుతుందని పేర్కొన్నారు. అనంతరం టౌన్ సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్‌తో కలిసి పట్టణ శివారులోని ప్రమాద స్థలాలను పరిశీలించారు. కొనకొండ్ల రోడ్డులోని ఎంబీఏ కళాశాల సమీపంలోని మార్మెమ్మ గుడి మలుపు వద్ద, ఆలూరు రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు రోడ్డు రవాణా శాఖ, పోలీసు శాఖ కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

వివాహిత అదృశ్యం



ప్రవల్లిక

తాడిపత్రిటౌన్: పట్టణంలోని రాగితోటపాలెంకు చెందిన ప్రవల్లిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 7 సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డకు చెందిన గౌతమ్‌తో ప్రవల్లికకు వివాహం అయింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా రెండు నెలల క్రితం ప్రవల్లిక తాడిపత్రికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 17 అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుత్తికి చేరిన పాదయాత్ర

గుత్తి: కడప జిల్లా పులివెందులలో ప్రారంభమైన షిర్డీ సాయి బాబా భక్తుల పాదయాత్ర బృందం గురువారం గుత్తికి చేరింది. ఈ సందర్భంగా గుత్తి షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు జేకే రాము, సభ్యులు ప్రసాద్, సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర బృందం సభ్యులు పట్టణంలోని షిర్డీ సాయి బాబా ఆలయానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. పాదయాత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ.. ఈనెల 18 పులివెందులలో పాదయాత్ర ప్రారంభించామన్నారు. పులివెందుల నుంచి షిర్డీకి 900 కిలోమీటర్ల పాదయాత్ర తలపెట్టామన్నారు. 36 రోజుల పాటు పాదయాత్ర జరుగుతుందన్నారు. వచ్చే నెల 22న షిర్డీ చేరుకుంటామని తెలిపారు.

కంటి పరీక్షలు చేయించుకోకపోతే పింఛన్ల రద్దు

గుత్తి రూరల్/గుత్తి: సచివాలయ ఉద్యోగుల నుంచి నోటీసులు అందుకున్న అంధత్వ పింఛన్‌దారులు తిరిగి కంటి పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. నోటీసుతో పాటుగా ఆధార్, సదరం సర్టిఫికెట్లు తీసుకుని ఈనెల 25న గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉదయం 50 మందికి మధ్యాహ్నం 50 మందికి మాత్రమే పునర్ పరిశీలన ఉంటుందని తెలిపారు. 25న పరీక్షలు చేయించుకోని వారికి పింఛన్లు రద్దు చేస్తామని తెలిపారు.

27 నుంచి కంది కొనుగోళ్లు

గార్లదిన్నె: ఈనెల 27 నుంచి మార్క్‌ఫెడ్ ద్వార రైతులు పండించిన కందులను కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటా రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తారన్నారు. ముందుగా రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కందుల్లో 12 శాతం తేమ మించరాదన్నారు.

ఖైదీలకు నిరంతర వైద్య సేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

బుక్కరాయసముద్రం: జిల్లా జైలులోని ఖైదీలకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. రెడ్డిపల్లి సమీపంలోని జిల్లా జైలులో సూపరింటెండెంట్ రహమాన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు క్రమతప్పని యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. వసంతకుమార్, నాగరాజు, హరీష్ పాల్గొన్నారు.